క్లుప్తంగా

బాబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైంసా, లోకేశ్వరం, నర్సాపూర్(జి), కుంటాల, దిలావర్‌పూర్ మండలాల నుంచి మహిళలు పాదయాత్రగా వచ్చి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

'పదేళ్ల తర్వాత ఉద్యమకారులకు గుర్తింపు'

నిర్మల్: పదేళ్ల తర్వాత తెలంగాణ ఉద్యమకారులకు సరైన గుర్తింపు లభించిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానాన్ని కల్పిస్తోందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలను పట్టించుకోలేదని.. ఉద్యమకారులను చిన్నచూపు చూసిందని విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఉద్యమకారులనూ గౌరవిస్తోందని తెలిపారు.

ఘనంగా శిఖర ప్రతిష్టాపన



యజ్ఞంలో పాల్గొన్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని పాతవెంకూర్ గ్రామంలోని దక్షిణముఖి ఆంజనేయస్వామి శిఖర ప్రతిష్టాపన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు వినయ్ పాండే ఆధ్వర్యంలో గణపతి, గౌరీ, కలశపూజ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ దత్తురాం పటేల్, వైస్ చైర్మన్ ఆడెపు రమేశ్, భుజంగ్‌రావు పటేల్, భోజారాం పటేల్, జానకీరాం, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీలో మొక్కు తీర్చుకున్న నాయకుడు

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విజయం సాధించడంతో బీజేపీ నాయకుడు అయిండ్ల భూపాల్‌రెడ్డి గురువారం షిర్డీ వెళ్లి సాయినాథుని వద్ద మొక్కు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డి గెలిస్తే షిర్డీ వస్తానని మొక్కుకున్నట్లు ఆయన తెలిపాడు. ఈమేరకు ప్రత్యేక పూజలు చేసినట్లు వెల్లడించాడు.

'ప్రజాసేవలోనే కొనసాగుతా'



మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజాసేవలోనే కొనసాగుతానని బీఆర్ఎస్ ఖా నాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో పలువురు ముఖ్య నాయకులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకుల కృషి మరువలేనిదన్నారు. ప్రజా తీర్పును స్వాగతించాల్సిందేనని.. బాధ్యత కలిగిన పౌరుడిగా ప్రజా పోరాటాల్లో ముందుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

'కస్తూరిబా' తనిఖీ



సిబ్బందితో తనిఖీ బృందం

పెంబి: ఎస్పీడీ ఆదేశాలనుసారం మండలంలోని మందపల్లి కస్తూరిబా పాఠశాలను ప్యానెల్ టీం లీడర్ రాంచందర్, పెంబి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా సెప్టెంబర్‌లో ఉన్నతి, బోధన తీరును, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గురించి తెలుసుకున్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తనిఖీ నిర్వహించారు. పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్‌వో వీణ తదితరులున్నారు.

సంగీతంపై శిక్షణ

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గురువారం సంగీత ప్రముఖ్ మెట్పోల్ల సాయినాథ్ విద్యార్థులకు సంగీతంపై శిక్షణ ఇచ్చారు. రెండురోజుల పాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సారథిరాజు, నీలిమా ఉన్నారు.

మరమ్మతులెప్పుడో..?

- వర్షాలకు దెబ్బతిన్న చెరువుల అలుగులు,పూడుకుపోయిన కాల్వలు
- బీళ్లుగా ఆయకట్టు భూములు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- యాసంగి పంటలకైనా సాగునీరు ఇవ్వాలని వేడుకోలు



తానూరులో దెబ్బతిన్న కాలువ



నిండుగా ఖర్బాలా చెరువు

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల కింద ఉన్న కాలువలు, అలుగులు దెబ్బతినడంతో వాటి పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. దీంతో సాగుభూములు బీళ్లుగానే ఉంటున్నాయి. మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తే తమ భూములకు సాగునీరు అంది సస్యశ్యామలంగా మారుతాయని రైతులు పేర్కొంటున్నారు.

తానూరు మండలంలో..

మండలంలో 31 పంచాయతీలుండగా ఆయా గ్రామాల పరిధిలో 16 చెరువులున్నాయి. బోల్సా, దౌలతాబాద్, ఖర్బాల, మసల్గా, కోలూరు, కోలురూతండా, మొగ్లి, మహలింగి, భోసి, సింగన్‌గాం, హిప్నెల్లి, వడ్‌ఝరి(బి), ఉమ్రి(కే), దాగాం, బోరిగాం గ్రామాల్లో తాగు, సాగునీటికి ఇబ్బందుల్లేకుండా మూడున్నర దశాబ్దాల కిందట చెరువుల నిర్మాణం చేపట్టారు.

దెబ్బతిన్న అలుగులు, పూడుకుపోయిన కాల్వలు..

ప్రత్యేక రాష్ట్రంలో గత ప్రభుత్వం మిషన్ కాకతీయలో భాగంగా చెరువుల్లోని పూడికను తొలగించి నీటి నిల్వ పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఈసారి కురిసిన వర్షాలకు చెరువులు నిండుకుండలా మారాయి. కానీ అధికారుల పర్యవేక్షణ లేక మండలంలోని చెరువుల అలుగులు దెబ్బతిన్నాయి. చెరువు నీరు పంటలకు వెళ్లేందుకు తవ్వించిన కాల్వలు పూడుకుపోయాయి. వెంటనే మరమ్మతులు చేయించి యాసంగి పంటలకైనా సాగునీరు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



బోరిగాంలో వాగు ద్వారా వృథాగా పోతున్న చెరువు నీరు

భారీవర్షాలకు మండలంలోని హిప్నెల్లి, వడ్‌ఝరి(బి) గ్రామాల్లోని చెరువుల కట్టలకు గండ్లు పడినా.. అధికారులు మాత్రం మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చెరువులో నీరు నిల్వ ఉండటం లేదు. వేసవిలో పశువుల దాహం తీర్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కాల్వలు సక్రమంగా లేక వర్షాకాలంలో చెరువుల కింద సాగు చేసిన పంటల్లోకి నీరు చేరి దెబ్బతింటున్నాయి. దీంతో అక్కడి రైతులు కిందకు నీరు వెళ్లేలా అలుగులను తోడేస్తున్నారు.

పట్టించుకోవడం లేదని..

మండలంలోని గ్రామాల్లో ఉన్న చెరువులను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఒక్కో చెరువు 200 నుంచి 300 ఎకరాల వరకు సాగునీరు అందిస్తుందని అధికారులు లెక్కలు వేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం చెరువుల కాల్వలు అధ్వానంగా మారాయి.

సాగునీరు అందడం లేదు



మాగ్రామంలో ఉన్న చెరువు కాలువలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీంతో మా పంటలకు సాగు నీరందడం లేదు. అధికారులు స్పందించి చెరువు ప్రధాన కాలువలకు మరమ్మతు చేపట్టి సాగునీరు అందించాలి.
– హైమద్ హుస్సేన్, రైతు, మసల్గా

కాలువలు పూడుకుపోయాయి



గ్రామంలో ఉన్న చెరువు కాలువలు పూడుకుపోవడంతో భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో బోరు మోటారుతో పంటలకు నీరు అందిస్తున్నాం. అధికారులు స్పందించి కాలువలను మరమ్మతు చేయాలి.
– గంగాధర్, రైతు, బోరిగాం

అటెన్షన్ ప్లీజ్.. మురికి కాలువ నిర్మించండి..



లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామంలోని ఎస్టీ వాడలో మురుగు కాల్వలు కరువయ్యాయి. దీంతో రోడ్డుపైనే మురుగు నిలిచి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కాలనీలో మురుగు కాల్వలు నిర్మించి రోడ్డుపై మురుగు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రఘువంశీ, పీఆర్ ఏఈ, ఫోన్: 95506 07360

తనిఖీ బృందానికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో 2022–23లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై శుక్రవారం నుంచి తనిఖీ నిర్వహించే సామాజిక బృందానికి సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌పీ రాఘవులు, ఏపీవో గంగాధర్ తదితరులు ఉన్నారు.

తనిఖీ బృందానికి శిక్షణ

తానూరు మండలంలోని గ్రామాల్లో 2022–23లో చేపట్టిన ఉపాధిహామీ పనుల వివరాలను నమోదు చేసేందుకు ఎస్ఆర్పీ రాఘవులు గురువారం డీర్పీలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీశక్తి భవనంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జాబ్‌కార్డులు, కూలీల వివరాలు, వారు చేసిన పనిదినాల వివరాలను నమోదు చేయాలని తనిఖీ బృందానికి సూచించారు. ఉపాధిహామీ సిబ్బంది సైతం సహకరించాలని కోరారు. ఏపీవో గంగాధర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'ఆదరించినందుకు అభివృద్ధి చేస్తా'



మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు

కుంటాల: ఎమ్మెల్యేగా ఆదరించినందుకు ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. గురువారం బోథ్ మండలం శిఖర్ కైలాష్ టేకిడి ఆలయానికి వెళ్తూ కుంటాలలో ఆగి పలువురు మహిళలతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి వెంట ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, మాజీ ఎంపీపీ అరుణ, పిప్పర వెంగళరావు, రమణారావు, మహేందర్, అప్క వంశీ, పవన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

భైంసాటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో గురువారం భైంసాలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవం నేపథ్యంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావు పటేల్, నాయకులు భైంసా నుంచి తరలివెళ్లారు. స్థానిక కమల జిన్నింగ్ ఫ్యాక్టరీ వద్ద అఖిలేశ్ భోస్లే ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. శంకర్ చంద్రే, ఓం ప్రకాశ్ లడ్డా, చందులాల్, రాంచందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

తానూరు: రాష్ట్ర సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల గురువారం తానూరులో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచుకుని టపాసులు కాల్చారు. కార్యక్రమంలో మాధవ్‌రావ్ పటేల్, పుండలిక్ తదితరులు ఉన్నారు.



తానూరులో సంబురాలు చేసుకుంటున్న నేతలు

సోన్: నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం స్వామి, బొడ్డు లస్మన్న, గంగాధర్, భోజన్న, చిన్నయ్య, లింగన్న, సాయన్న, గౌస్ నర్సయ్య, దశరథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సోన్: న్యూవెల్మల్‌లో నాయకుల నినాదాలు

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంఈవో మధుసూదన్

లక్ష్మణచాంద: తరగతుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. వారి విద్యా సామర్థ్యాలను నిత్యం పర్యవేక్షించాలని ఎంఈవో మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల నోడల్ అధికారి, ప్రధానోపాధ్యాయుడు అశోక్‌వర్మ అధ్యక్షతన పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించగా మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల పాఠాల ప్రణాళికలు, విద్యార్థుల వర్క్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, అభ్యాసన దీపికలను తరగతుల వారీగా అప్‌డేట్ చేయాలని నోడల్ అధికారికి సూచించారు. విద్యార్థులు గీసిన బొమ్మలను బోర్డుపై ప్రదర్శించేలా చూడటంతోపాటు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ని ప్రదర్శించాలని ఉపాధ్యాయులను కోరారు. విషయాల వారీగా లెస్సన్ ప్లాన్స్ తయారు చేసుకోవాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ రికార్డులు, రిజిస్టర్లు తయారు చేసుకుని మూల్యాంకనం చేయాలని సూచించారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయులు, ఆ ర్పీ సాయన్న, గోవర్ధన్, సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పురపాలక సంఘం పరిదిలోని 74 మంది కార్మికులకు స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్, ఈ–శ్రీ గ్రీన్ వర్క్స్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవనంలో వైద్యారోగ్యశాఖ సహకారంతో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షల అనంతరం అవసరమైన కార్మికులకు చికిత్స అందించారు. శిబిరంలో రాంనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత, సూపర్‌వైజర్ మతిన్, పీహెచ్‌వో రమణ, జన, లక్ష్మి, స్వరూప, వెంకటస్వామి, ఈ–శ్రీ గ్రీన్‌వర్క్స్ అధికారులు కిఫాయత్ ఖాన్, శరత్‌చంద్ర, మంజూష పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారి శ్వేత, సిబ్బంది

ప్రమాణస్వీకారానికి తరలిన నేతలు



ఎల్‌బీ స్టేడియం వద్ద ఖానాపూర్ నాయకులు

ఖానాపూర్: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి పట్టణంతో పాటు మండలానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కాంగ్రెస్ పాలనలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే రాష్ట్రం సమూల అభివృద్ధి చెందుతుందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, అమానుల్లా ఖాన్, సలీంఖాన్, గుగ్లావత్ రాజునాయక్, జంగిలి శంకర్, కంటం రవి, దొనికేని సాగర్, బి రాజేందర్, కొండ నారాయణ, కరిపె రాజు తదితరులున్నారు.



లక్ష్మణచాంద: హైదరాబాద్ వెళ్తున్న నాయకులు

లక్ష్మణచాంద: సీఎం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, అట్ల రవీందర్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, నాగేశ్, రవి, చిన్న రాంరెడ్డి, వెంకట్ తదితరులున్నారు.

ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుకు సన్మానం

ఖానాపూర్: హైదరాబాద్‌లో గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కాంగ్రెస్ నాయకులతోపాటు తెలంగాణ జనసమితి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల సరళితోపాటు ఇతర సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో దయానంద్, నిమ్మల రమేశ్, తోట సత్యం, యూసుఫ్‌ఖాన్, గంగనర్సయ్య, తిలక్‌రావు, ఆనంద్, సచిన్, భీమేశ్, షౌకత్‌పాషా, ముషీర్ తదితరులు ఉన్నారు.

పెంబి: హైదరాబాద్‌లో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కాంగ్రెస్ పెంబి మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, నాయకులు కలిసి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో శంకర్, భూమేశ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఖానాపూర్: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నేతలు

గోదాంల నిర్మాణం పూర్తయ్యేదెన్నడు..?

- 'రూర్బన్' కింద కుంటాల మండలం ఎంపిక
- మూడేళ్లుగా కొనసాగుతున్న పనులు
- ఎదురుచూస్తున్న రైతులు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన గోదాంల నిర్మాణ పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. గోదాంలు అందుబాటులోకి వస్తే తమ ఇబ్బందులు దూరమవుతాయనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. గుత్తేదారుల నిర్లక్ష్యం, నిధుల మంజూరులో జాప్యం నెలకొనడంతో నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. యాసంగి పంటలు చేతికొచ్చే వరకైనా గోదాంలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

రూర్బన్ పథకంలో భాగంగా..

పట్టణాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూర్బన్ పథకానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో కుంటాల మండలాన్ని పథకం కింద ఎంపిక చేసి పలువురికి స్వయంఉపాధి కల్పించడంతోపాటు రైతులకు గోదాంల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది.

మూడు గ్రామాల్లో..

పథకంలో భాగంగా మండలంలోని అంబకంటి, అందాకూర్, ఓలా గ్రామాల్లో మూడు గోదాంల నిర్మాణ పనులను చేపట్టింది. అప్పటి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేశారు. ఒక్కో గోదాం నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరవగా మూడు గోదాములకు గాను రూ. కోటి 20 లక్షలు వెచ్చించారు. ఒక్కో గోదాం 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించారు.



ఓలాలో అసంపూర్తిగా గోదాం నిర్మాణం

విడుదల కాని నిధులు..

పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో పనులు కొనసాగాయి. కాంట్రాక్టర్లు 2021 మార్చి నెలలోగా పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలి.. కానీ గడువు తేదీ ముగిసి సుమారు మూడేళ్లవుతున్నా ఇప్పటికీ అసంపూర్తిగానే గోదాంలు దర్శనమిస్తున్నాయి. మండలంలో మొత్తం సాగు భూమి.. 21,629 ఎకరాలుండగా 7,809 మంది రైతులు ఉన్నారు. రైతులు అన్ని రకాల పంటలను కలిసి వానాకాలంలో 2,81,403 క్వింటాళ్లు.. ఎండాకాలంలో 3,06,291 క్వింటాళ్ల దిగుబడులు పండిస్తారు.

అసంపూర్తిగా పనులు..

అంబకంటిలో గోదాం నిర్మాణ పనులు చివరిదశకు చేరాయి. ఓలా, అందాకూర్ గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. అధికారలు స్పందించి పనులు వెంటనే పూర్తి చేయాలని రైతుల కోరుతున్నారు.

పనులు నిలిచిపోయాయి



ప్రభుత్వం గోదాం నిర్మిస్తామంటే రైతులందరం సంతోషపడ్డాం. ప్రారంభించిన పనులు మధ్యలోనే ఆపివేశారు. అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.
– నాలం మహేందర్, ఓలా

త్వరగా పూర్తి చేయాలి



అందాకూర్‌లో గోదాంను ఊరు బయట నిర్మించారు. రైతులు, వాహనా లు వెళ్లాలంటే చెరువులో నుంచి వెళ్లాల్సి ఉంది. మాకు ఇబ్బంది లేకుండా రోడ్డు ఏర్పాటు చేసి ఆగిపోయిన గోదాం నిర్మాణ పనులను పూర్తి చేయాలి.
– ఎర్రోజు ప్రశాంత్‌కుమార్, అందాకూర్

నిధుల విడుదలకు చర్యలు

గతంలో నిధుల విడుదల జాప్యం, గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు విడుదల చేయించి గోదాంల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపడతాం.
– విజయలక్ష్మి, డీఆర్డీవో

స్వయంఉపాధిలో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలకేంద్రంలోని ఫకీర్‌గుట్ట కాలనీలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ నాక్ ఆధ్వర్యంలో మూడో బ్యాచ్ 30 మందితో మూడు నెలల ఉచిత కుట్టు శిక్షణ గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయి హాజరయ్యారు. శిక్షణ పొందిన 25మందికి నాక్ నుంచి ఉచితంగా అందించే కుట్టు మిషన్లను అందజేశారు. అనంతరం పీవో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందినవారిని అభినందించారు. ఈ సందర్భంగా పీవోను శాలువాతో సన్మానించారు. నాగ్ ఏడీ నాగేంద్రం, లేబర్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ గంగన్న, ఉట్నూర్ సామాజిక కార్యకర్త అంజద్‌ఖాన్, నాక్ ఇన్‌స్పెక్టర్ నిక్కత్ తదితరులున్నారు.